నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 30 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




## చరిత్రను మరుగున పడేసే కుట్ర



పోరాటాల చరిత్ర కలిగిన తెలంగాణ రాష్ట్రాన్ని అబాసుపాలు చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో తెలంగాణ వైభవానికి ప్రతీకలైన చార్మినార్, కాకతీయుల కళా తోరణాన్ని రాష్ట్ర చిహ్నంలో లేకుండా చేసేందుకు, తెలంగాణకు ప్రత్యేకత లేకుండా చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నది. తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ చేస్తున్న దాడి అని చెప్పవచ్చు. తెలంగాణలోని చరిత్రాత్మక ఆనవాళ్లను తుడిచి వేయాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది.


*- సామల రాజన్న, తెలంగాణ మలిదశ యువ ఉద్యమకారుడు.*

# వైభవ చిహ్నాలపై కాంగ్రెస్ కుట్ర

**కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తులను తొలగించే చర్య**

### ఇదీ తెలంగాణ గుర్తింపునకే విఘాతం కలిగించే చర్య

### రాష్ట్ర ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శల పర్వం



*పోరాడి సాధించుకున్న తెలంగాణలో చరిత్రాత్మక ఆనవాళ్లయిన చార్మినార్, కాకతీయుల కళాతోరణం వంటి గుర్తులతో రూపొందించిన తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడంపై తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ దురుద్దేశంతోనే తొలగించి ఇష్టానుసారంగా రాష్ట్ర చిహ్నాన్ని సీఎం రేవంత్‌రెడ్డి రూపొందించడం సరికాదంటున్నారు. సంస్కృతి, చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న వాటికి ప్రాధాన్యమిచ్చి కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంలో స్థానం కల్పించింది. ఈ చిహ్నానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రేవంత్‌రెడ్డి చిహ్నాన్ని మార్చడం తెలంగాణ చరిత్రకే మాయని మచ్చగా మిగులుతున్నది. ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.*

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 29(నమస్తే తెలంగాణ)*

### ప్రజల దృష్టిని మరల్చడానికే చర్యలు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నది. తెలంగాణలోని చరిత్రాత్మక అంశాల ఆధారంగా కేసీఆర్ ప్రభుత్వం మేధావులతో చర్చించి రాష్ట్ర చిహ్నాన్ని రూపొందించింది. అప్పట్లో ఈ చిహ్నాన్ని ఉద్యమకారులు, కళాకారులు, కవులు అభినందించారు. చరిత్రను తెలిపేలా ఉన్న లోగోని మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి కావాలనే ఇలాంటి పనికి మాలిన చర్యలకు పాల్పడుతున్నారు.

*- కుందారపు శంకరమ్మ, తెలంగాణ ఉద్యమ నాయకురాలు.*

# ధాన్యం ఏమైనట్టు?

**2021-22 యాసంగి వడ్ల లెక్కలపై క్లారిటీ మిస్**

- మిల్లులకే వెళ్లిందా? ఇంకెక్కడికైనా వెళ్లిందా? అనేది డౌట్
- మిల్లర్లు గుర్తింపు పత్రం ఎందుకు ఇవ్వలేదు..



రేచీని గోదాముల నుంచి లారీలో తరలుతున్న ధాన్యం



గోదాములలో ధాన్యం నిల్వలు

మంచిర్యాల, మే 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 2021-22 యాసంగి ధాన్యం లెక్కలపై క్లారిటీ మిస్ అయింది. మంచిర్యాల జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా గజిబిజిగా మారింది. గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యం ఇంకా గోదాముల్లోనే ఉందా? లేక మిల్లులకు చేరిందా? తెలియపోవడంతో ఈ ధాన్యాన్ని ఎవరైనా అమ్ముకున్నారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2021-22 యాసంగిలో ధాన్యం అధికంగా రావడంతో సివిల్ సప్లయ్ అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ఐకేపీ, డీఆర్‌డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఏజెన్సీల బాధ్యతతో రెండు నెలలపాటు నిల్వ చేసేందుకు 12 మార్కెట్ కమిటీ గోదాములను కేటాయించారు. డీసీఎంఎస్ ఏజెన్సీకి మూడు ఇంటర్మీడియట్ గోదాములను కేటాయించగా భీమారంలో 1,342, కోటపల్లిలో 1,102.080, లింగాపూర్‌లో 1958.920 మొత్తం 1,342 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ చేశారు. డీఆర్‌డీవో ఐకేపీ ఏజెన్సీకి నాలుగు ఇంటర్మీడియట్ గోదాములను కేటాయించగా భీమారంలో 2534.480, చెన్నూర్‌లో 2036.720, జన్నారంలో 2681.160, వేమనపల్లిలో 606.720 మొత్తం 7859.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేశారు. పీఏసీఎస్ ఏజెన్సీకి ఐదు ఇంటర్మీడియట్ గోదాములను కేటాయించగా చెన్నూర్‌లో 2110.880, జన్నారంలో 1381.880, కాసిపేటలో 3748.680, రేచినీలో 2068.960, వేమనపల్లిలో 2383.240 మొత్తం 11,692.840 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దిగుమతి చేశారు. ఇలా మొత్తంగా 12 గోదాముల్లో 23,955.920 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దించారు.

### కనిపించని ధాన్యం

ప్రస్తుతం ఈ గోదాములలో ధాన్యం నిల్వలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఒక రేచిని గోదాములోని 1400 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా మిగతా 11 గోదాముల్లో ధాన్యం నిల్వలు నామమాత్రంగానే ఉన్నాయి. ధాన్యం నిల్వలపై ఏజెన్సీలను సంప్రదిస్తే ధాన్యం మొత్తం పెద్దపల్లి జిల్లాలోని రెండు మిల్లులకు పంపినట్లు చెపుతున్నారు. ఈ ధాన్యాన్ని మిల్లుల్లో ఇంటర్మీడియట్ గోదాముల్లో ప్యాడీ దించుకున్నట్లు ఎక్కడ కూడా గుర్తింపు పత్రాలు ఏజెన్సీల వద్ద లేవు. సివిల్ సప్లయ్ శాఖకు కూడా అప్పగించలేదు.

### ధాన్యం ఏమైనట్లు?

ఎంఎస్‌పీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కానీ, ఇంటర్మీడియట్ గోదాముల నుంచి కానీ మిల్లులకు చేరితే బస్తాలను దించుకున్న మిల్లుల యజమానులు వచ్చిన ధాన్యం గ్రేడ్‌తోపాటు ధాన్యం సామర్థ్యం, ఎంత ధాన్యం చేరిందనే విషయాన్ని మిల్లర్ సంతకం చేసి రిసిప్ట్‌లు అందచేస్తారు. ఇప్పటి వరకు పౌర సరఫరాల శాఖ వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ గుర్తింపు పత్రాలు నేటి వరకు పౌర సరఫరాల శాఖ అధికారులు అప్పగించకపోవడంపై ఈ ధాన్యం మిల్లులకే పోయిందా? లేక బయట ఎక్కడైనా అమ్ముకున్నారా? అనే అనుమానాలు వెలువడుతున్నాయి. అసలు ఏ ధాన్యం ఏ మిల్లుకు పోయింది. ఎంత ధాన్యం వెళ్లింది. అనే విషయాన్ని పట్టించుకునే నాథుడు కరువు కావడంపై అనుమానాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీఎం గోపాల్‌ను వివరణ కోరేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

## శివ సాయి రైస్‌మిల్ యజమానిపై క్రిమినల్ కేసు

**రూ.1.29 కోట్ల విలువ గల సీఎంఆర్ బియ్యం పక్కదారి**

జైపూర్, మే 29 : సీఎంఆర్ బియ్యం సకాలంలో ప్రభుత్వానికి అందజేయని రైస్‌మిల్ యజమానిపై పౌర సరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. ఇందారం గ్రామంలో గల శివసాయి రైస్‌మిల్‌ను మంచిర్యాల సివిల్ సప్లయ్ ఆఫీసర్లు ఇటీవలే తనిఖీ చేశారు. శివ సాయి రైస్ మిల్(మల్లికార్జున ట్రేడర్స్) యజమాని గుంత రవికుమార్ ప్రభుత్వానికి అందజేయాల్సిన 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన రూ.1.29 కోట్ల విలువ గల సీఎంఆర్ బియ్యాన్ని రైస్‌మిల్ యజమాని పక్కదారి పట్టించినట్లు సివిల్ సప్లయ్ ఆఫీసర్లు గుర్తించారు. ఈ మేరకు రైస్‌మిల్ యజమాని గుంత రవి కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.




ఇందారంలో సీజ్ చేసిన రైస్‌మిల్

# పత్తి విత్తనాల కొరత

- జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం 3.40 లక్షల ఎకరాలు
- కావాల్సిన విత్తనాల ప్యాకెట్లు 7 లక్షలు
- అందుబాటులో ఉన్నవి 2 లక్షలే
- ఎరువుల పరిస్థితి కూడా ఇదే

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో ఓ వైపు నకిలీ విత్తనాలు ముంచెత్తుతుంటే..రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాల కొరత వేధిస్తున్నది. ఈ ఏడాది జిల్లాలో 3.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ అధికారులు అం చనా వేశారు. ఇందుకోసం 7లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయని గుర్తించారు. జిల్లాలోని ప్రైవేట్ డీలర్ల వద్ద 2 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. ఓ వైపు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో రోజుకో ప్రాంతంలో నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నాయి. మరోవైపు నకిలీ విత్తనాల బారిన రైతులు పడకుండా జిల్లాలో డిమాండ్ మేరకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.




సిర్పూర్-టీలో ఖాళీగా దర్శనమిస్తున్న ఫర్టిలైజర్ దుకాణం

### కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా..!?

జిల్లాలో అక్కడక్కడ వర్షాలు పడుతుండడంతో రైతులు దుక్కులు దున్ని జూన్ మొదటి వారంలోనే విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గత యాసంగిలో ఆశించినంతగా దిగుబడులు రాకపోవడంతో ఈ వానాకాలంపైనే అ న్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేయగా అందుకు తగ్గట్టుగా విత్తనాలను అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వానాకాలం విత్తన ప్రణాళికలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. మరో వైపు వ్యాపారులు ఇదే అదునుగా విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### నకిలీలకు ఆస్కారం కల్పించేలా..!

ఇప్పటికే జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడుతున్న సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాలపై కొరడా ఝులిపిస్తున్నప్పటికీ వ్యాపారులు మాత్రం తీరు మార్చుకోవడం లేదు. సిర్పూర్-టీ, చింతలమానేపల్లి మండల్లాల్లో నకిలీ విత్తనాల విక్రయాన్ని కొంత మంది వ్యాపారులు వృత్తిగా మార్చుకున్నారు. ఎలాంటి భయం లేకుండా నకిలీ విత్తనాలను యథేచ్ఛగా గ్రామాల్లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో ఫర్టిలైజర్ దుకాణాల్లో పత్తి విత్తనాలు కొరత ఉండడం, ఇదే అదునుగా కొంత మంది వ్యాపారులు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తుండడంతో గత్యంతరం లేక రైతులు వాటినే కొంటున్నారు. వానాకాలం సమీపిస్తున్నప్పటికీ రైతు భరోసా పథకంపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

### ఎరువులు కూడా కొరతే..

వానాకాలం సాగుకు కావాల్సిన ఎరువులు కూడా జిల్లాలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ ఏడాది 4,52,348 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు యూరియా 45060 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 17764 మెట్రిక్ టన్నులే అందుబాటులో ఉన్నాయి. డీఏపీ 11265 మెట్రిక్ టన్నులకు 609 మెట్రిక్ టన్నులు, పొటాష్ 4053 మెట్రిక్ టన్నులకు గాను 147.55 మెట్రిక్ టన్నులు, సూపర్ పాస్ఫేట్ 3 వేల మెట్రిక్ టన్నులకు 567.10 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22538 మెట్రిక్ టన్నులకు 1235.71 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిమాండ్ మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

## ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**

నస్పూర్, మే 29 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళతో కలిసి కౌంటింగ్ సూపర్ వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఓట్లను జూన్ 4న హాజీపూర్ మండలంలోని ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో లెక్కించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఉదయం 7.30 గంటలలోపు అధికారులు సిబ్బంది హాజరు కావాలన్నారు. అనుమతి పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. లెక్కింపు, ఫలితాల వివరాలలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సూక్ష్మ పరిశీలకులు, పర్యవేక్షకులు నమోదు చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా ప్రతి అంశాన్నీ పర్యవేక్షిస్తారని తెలిపారు. జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు.

## దొంగను పట్టించిన సోషల్ మీడియా



జైపూర్ ఏసీపీ కార్యాలయంలో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

జైపూర్/వేమనపల్లి, మే 29: వేమనపల్లి మండలం కల్మపల్లిలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సల్పాల శ్రీనివాస్‌ను బుధవారం అరెస్ట్ చేసి రూ.10,97,600 విలువ గల బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును నీల్వాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జైపూర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం రామగుండం సీపీ శ్రీనివాస్ మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి వెల్లడించారు. ఈ నెల 26న అర్ధరాత్రి కల్మపల్లిలో నెందుగూరి రామన్న ఇంట్లోకి శ్రీనివాస్ చొరబడి నగలతో పాటు రూ. 2,62,600 నగదును ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వద్ద రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ శ్యాంపటేల్ ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలించారు. బుధవారం కల్మపల్లి గ్రామ అటవీ సరిహద్దు నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా సోషల్ మీడియా ద్వారా అందిన సమాచారం మేరకు శ్రీనివాస్‌ను పట్టుకున్నారు. సుమారు 16 తులాల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ.2,62,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని యువకులు సోషల్ మీడియాలో నిందితుడి వివరాలు విస్తృతంగా ప్రచారం చేయడంతో తమకు సమాచారం అందిందని తెలిపారు. నిందితుడిని పట్టుకున్న చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, పోలీస్ సిబ్బందిని సీపీ అభినందిస్తూ రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినా, సరఫరా చేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద నాణ్యమైన విత్తనాలనే కొనాలని సూచించారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679